సెభాష్

# ఏమైపోదాం?

అవసరాల రామకృష్ణారావు

'ఏదో ఒకటి అయిపోదాం-తప్పదు' అన్నాడు జగన్నాథం. వాడికళ్ళల్లో ధృఢనిశ్చయం భీష్మ ప్రతిజ్ఞనీ, మంగమ్మ శపథాన్నీ జ్ఞాపకం తెస్తోంది.

"అవును. తప్పకుండా అయిపోదాం! ఏమై పోదాం?" అన్నాడు సుబ్బారావు. గెడ్డంక్రింద చెయ్యి ఆన్చి అదో విధంగా పైకిచూస్తూ ధ్యాన ముద్రలో పడ్డాడు సుబ్బారావు.

వాళ్ళు వినీలాకాశంలో స్వేఛ్ఛావిహంగాలు. వాళ్ళముందు పంజరాలూ, చెలియలికట్టలూ లేవు. వాళ్ళదృష్టిలో వారికి కావలసిన వారెవరైనా ఉంటే ఒకరికొకరే.

కెరటాలగోలకీ, సమంగా అల్లరిచేసే పిల్లల గోలకీ-అందకుండా యిద్దరూ దూరంగా బీచిలో ఒకమూలగా కూర్చుని ఆలోచిస్తున్నారు.

"గెడ్డం మాసిపోయింది - సరే ఋషులకు నిలయమైన మనదేశంలో అది ఆట్టే ఆక్షేపణ కాదనుకో. మనిద్దరం సెర్వరుకి అర్జరిచ్చి ఎన్నాళ్ళయిందో నీకు తెలుసు- ఎందుకూ వెధవ బతుకు బీడీముక్కకి దిక్కులేక పోయాక?...మా తమ్ముడి వెధవమీద ఉన్న ప్రేమలో వెయ్యోవంతు లేక పోయింది నామీద మా నాన్నకి. మరి వాడిలా పుస్తకం ముందేసి కూర్చోవడమే పని కాదుగా నాకు? మరీ మానాన్న ఒక్కదమ్మిడీ యియ్యడం మానేశాడు!...ఎలాగంటావ్?"

జగన్నాథం మాటాడలేదు. అయిదునిముషాలు ఊరుకుని ఆరంభించాడు, "అవునుమరి...మన వాళ్లు మనకిష్టమయిన మార్గంలో మనల్ని పెట్ట లేదు. అందుకునే ఎందుకూ కొరగాని వాళ్ళ మయ్యాం. బియ్యే ప్యాసయినవాళ్లు ఏం ఊడ బొడిచేస్తున్నారో మనమూ ఎరుగుదుం. అది తెలిసీ - అనుభవముండీ కూడా-మానాన్న నిన్ను ఆరోఛాన్సు యింటర్మీడియట్ కట్టించకమానడు. నేను ఆ స్కూలుఫైనలూ అయిందనిపించలేదు. ఏమిటి మనిద్దరికీ తేడా? విలువలేనిదని తెలిసినా చదువుకుంటేగాని నాలుగు పరీక్షలు ప్యాసయితే గాని ఎవరూ తలెత్తి మనల్ని చూడరు. సరే-యిది ఎంతవరకో మనమూచూద్దాం..." సుబ్బారావు అప్రయత్నంగా అందుకున్నాడు.

"నిజమే-మనవాళ్ళే మనల్ని పూచికపుల్లల్లా చూస్తూ ఉంటే ఒకర్ని అనుకోడమెందుకూ? నేనూ అరగంట కోటూకొట్టి, ట్వీడ్ సూటు వేసి, పైకి కనపడేలా రుమాలు పెట్టుకొనివస్తే-మొన్న టిలా నిర్మల నన్ను అన్ని మాటలు ఆడేదా? డబ్బురా, భాయీ డబ్బు!"

"అవును. అదే సంపాదించాలి. మామిడిచిగుళ్లు ఉంటేనే కోయిలలు వచ్చేది... ఆ తరవాత అవి పాడనే పాడతాయి. మనకీర్తి అప్పుడు ఎలాగా వ్యాపిస్తుంది... విద్యా సంబంధంలేని...ఉన్నత స్థానం సంపాదించాలి. ఎవరికీ అందనంత ఎత్తుని మనిద్దరం ఉంటే అందరూ చూసి ఏడ్చుకోవాలి. అందుకనే నే అన్నది - కాస్త రెండుబుర్రలూ జోడించి, ఆలోచించి...... ఏదో ఒకటి అయి పోదాం అని" అన్నాడు జగన్నాథం.

"అవును...అదే...ఏమైపోదాం?"అన్నాడు సుబ్బారావు.

పదిరోజులు పోయిన తరువాత మళ్ళీ ఓనాడు వాళ్ళిద్దరూ అక్కడే కూర్చున్నారు. నిరాశ, నిస్ప్రహా వాళ్ళ కళ్ళల్లో కనిపిస్తోంది. ఇద్దరూ కొంతసేపు వాళ్ళకు పని యివ్వలేని డబ్బు సంపాదించి పెట్టలేని సమాజాన్నీ, ప్రభుత్వాన్నీ, ప్రపంచాన్నీ - దేముణ్ణీ కసిదీరా తిట్టుకున్నారు.

"ఏం చెయ్యడం? అదృష్టమన్నది మనతోలు చేతులలో ఉన్నట్టు కనిపించదు. నే ఆరునెల్ల నుంచి పజిల్సుకడుతున్నానన్న సంగతి నీకు తెలిసిందేగా! మా అమ్మనీ, తమ్ముడ్నీ బెల్లించి సొమ్ము చేజిక్కించుకొని - ఆఖరికి అవసరాల్ని సహితం మానేసి-అంతసొమ్మూ పజిల్సుకి పెడితేయెన్నడూ

యెనిమిది తప్పులకి తక్కువరాలేదు!" అన్నాడు సుబ్బారావు.

"పోనీ నాకేనా పలకకూడదట్రా బ్రదర్-ఉంగరం, వాచీ అయినా హరించిపోయాయిగాని క్లబ్బులో పేకాటలో కాణీ వచ్చిందా?"

జగన్నాథం మాటలకి అంతరాయం కలిగింది. ప్రక్కన ఎవరో అతి మధురంగా బుల్ బుల్ వాయిస్తున్నారు. చేపలుపట్టే కుర్రాడొకడు ఇసుకమీద నిలబడిన చిన్న బోటులో కూర్చుని సినిమాపాటలు వాయించుకుంటున్నాడు. వీళ్ళిద్దరూ వాడిచేత కొన్ని హిందీపాటలు వాయింపించారు. వచ్చేస్తూంటే దారిలో-

"ఒరే జగం! సంగీతం అంటే యింత యిష్టమని నాకివాళే తెలిసిందిరా! బుల్ బుల్ వింటున్నంతసేపూ మైమరచిపోయాననుకో" అన్నాడు సుబ్బారావు. మళ్ళీ ఓగడి ఊరుకుని-

"ఒరే, బుల్ బుల్ వాయించడం అంత కష్టమా?" అన్నాడు. జగన్నాథం ఇంకా మాట్లాడలేదు. సుబ్బారావే మళ్ళీ అన్నాడు.

"కంటిముందు కనకవర్షాన్ని మనం కాంచలేకపోతున్నాము. ఈ బుల్ బుల్ యింత చవకై, ఇది నేర్చుకోడం యింత సుళువైతే-మనం ఇందులోనే విద్వాంసులం ఎందుకైపోకూడదు?"

"ఛీ, ఊరుకో-నీకేదికనపడితే అదే" అని కోప్పడ్డాడు జగన్నాథం.

"పోనీ ఓపని చేద్దామా? బొమ్మలురాయడం మొదలెడితే?"

"నువ్వూ-నేనూ బొమ్మలురాయడం మొదలిడితే మూలస్వరూపాలు పేర్లు మార్చుకోవలసి వస్తుంది..."

"మరి ఏమైపోదాం? ఓ వ్యాపారం చేద్దామన్నా, ఫోటో స్టూడియో పెడదామన్నా కాణీ లేదాయె-ఎలాగ? అన్నీ వద్దంటావ్, ఇవాళతో ఏదో ఒకటి తేల్చెయ్యరా..."

సుబ్బారావే మళ్ళీ యింకో మెథడ్ సజెస్టు చేశాడు.

"పోనీ మరోపని చేద్దాం...నువ్వుకోప్పడకు. లోకంమీద కోపం వెళ్ళబోస్తూ కథలు రాద్దాం. పేరూ వస్తుంది, అయిదూ పదీ చేతికీ వస్తాయి!"

జగన్నాథానికి వళ్లుమండింది.

"నే ఉన్నమాట అంటాను, ఏడవకు. లోకంమీద ఎందుకు కోపమో ఆలోచిస్తే మనకే తెలీదు. కల్పించిరాద్దామన్నా తప్పులురాయకుండా దరఖాస్తు ఫారమైనా మనం పెట్టలేము. తెగించి రాసి పంపినా, పత్రికలవాళ్లు అమ్ముకుని పకోడీలు కొనుక్కుంటారు!"

"మరి ఏమైపోదాం?"

"ఓ డబ్బున్న అమ్మాయి మనమీద కన్నేసినా ఓ ధనికుడు మన్ని పెంచుకున్నా బాగుండిపోను, ఎంతో లాభిస్తుంది!"

"లాభిస్తుందో లేదోగాని అలాంటి ప్రయత్నాలు చేస్తే దవడే చేతిలోకొస్తుంది."

"ఈ కబుర్లన్నీ ఊరికే సరదాకి అన్నాను. మనం ఏమైపోవాలో నేను ఆలోచించే ఉంచాను ఇలారా" జగన్నాథం ఏదో చెప్పేడు. సుబ్బారావు ఎగిరిగంతేశాడు. మరునాడు వీళ్ళిద్దరూ ఊళ్లో కనిపించలేదు!

* * *

వీళ్ళకథంతా విన్నాను నేను. వీళ్లు వెళిపోయాక సుబ్బారావూ వాళ్ళమ్మమాత్రం కొన్నాళ్లు మంచందిగలేదుట. జగన్నాథానికి తల్లిలేదు. వాళ్ల తండ్రినడుగుతే పెదవి విరిచి,

"తల్లిని ఉసురు పెట్టడానికీ, తండ్రికి ఎసరు పెట్టడానికీ పుట్టేరు వీళ్లు - లేరని ఏనాడో అనుకున్నాం" అన్నాడు. వాకబుచెయ్యగా సినిమాలో చేరదామని వీళ్ళిద్దరూ మద్రాసు వెళ్ళేరని తెలిసింది. మళ్ళీ వీళ్ళకబురే తెలీలేదు. నాలుగేళ్లు గడిచాయి.

ఈ మధ్య పనిమీద వైజాగ్ వెళ్ళినప్పుడు హార్బరూ, ఏరోడ్రోముతోపాటు పిచ్చాసుపత్రికూడా చూశాం-అక్కడున్నారు వీళ్లు! ఆ పిచ్చిలోకూడా సుబ్బారావు జగన్నాథాన్ని 'ఏమైపోదాం?' అని అడుగుతున్నాడు! ఏమైపోయారో వీళ్ళకి తెలీదుకదా!

---

ప్రేమ అనే వ్యాధి ఒక్కక్షణంలో ముంచుకురావచ్చు. కాని, వ్యాధి నిర్మూలించి రోగికి తిరిగి ఆరోగ్యం రావటానికి చాలా కాలంపడుతుంది.—హ్యూగో